క్లుప్తంగా

ముగ్గురికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత



లక్ష్మీపురం: నిబద్ధతతో, అంకితభావంతో ప్రభుత్వ సర్వీసు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కారుణ్య నియామకాలకు సంబంధించి ఉత్తర్వులను అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, పీడీ హౌసింగ్, డీఆర్డీఏ ప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులపై దృష్టి




నెహ్రూనగర్: నగర శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టడానికి ఏఈల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రాధాన్యం క్రమంలో పనులు చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాయీబ్రాహ్మణకాలనీ, తుఫాన్ నగర్, భాగ్యనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ ప్రసాద్, ఇంజినీరింగ్, ప్రజారోగ్యధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ స్తంభాల మార్పిడి దృష్ట్యా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు-3 డీఈఈ బి.రాజమోహన్ సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. ఏలూరుబజారు, పట్నంబజారు, సంపత్‌నగర్, నల్లచెరువు, గంటలమ్మచెట్టు ప్రాంతం, మార్కెట్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్యులకు వందనం

- నేడు డాక్టర్స్ డే
- భుజం తట్టి ధైర్యం చెబితే రోగం నయం
- ప్రత్యక్ష దేవుళ్లు వైద్యుల సేవలు ఎనలేనివి
- ఏఐ వచ్చినా డాక్టర్ డాక్టరే....



గుంటూరు మెడికల్: మాతత్వానికి పురుడు పోసి, ఓ జీవికి ప్రాణం పోసి ఆ బిడ్డ చిరునవ్వుల్లో పొంగిపోయే మహనీయుడు వైద్యుడు. లయ తప్పిన గుండెకు గుప్పెడంత ప్రేమతో ఆయువుపోసే సంజీవనులు వైద్యులు. చిన్న జ్వరానికే చిగురుటాకుల్లా వణికే చిన్నారులు, అవ్వాతాతల బోసినవ్వుల్లో కొలువైన దేవుళ్లు వైద్యులు. మనసున్న మారాజులందరికీ జూలై ఒకటి నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు..

కరోనా రాక్షసి నుంచి కాపాడారు....

కరోనా విపత్తును చూశాం. మూడేళ్ల క్రితం బంధాలు, బంధుత్వాలు, కులాలు, మతాలు అన్నీ ముఖాన మాసుకేసుకుని కరోనా అడ్డుగోడలు కట్టుకున్నాయి. రక్తం పంచుకున్న వారు కాలం చేస్తే కాటి వరకు కూడా వెళ్లలేక కళ్లలో భయంతో నాలుగు గోడల మధ్య చిక్కుకున్నాం. ఈ సమయంలో వృత్తి ధర్మాన్ని గుండెల్లో నింపుకుని దేవుడు పంపిన మనుషుల్లాగా అర నిమిషంలో ఆవిరవుతున్న ప్రాణాలను అరచేత్తో అడ్డుపెట్టి కాపాడారు వైద్యులు. ఇలా వైద్య వత్తికి వన్నె తీసుకొస్తూ అటు వైద్య సేవేగాక సమాజ సేవలోనూ తాము భాగమై నిలుస్తున్నారు. జిల్లాలో ఎందరో వైద్యులు ఇదే కోవలో ప్రజలకు మనసుతో వైద్యం అందించి ప్రజల గుండెల్లో చిరస్థానం సంపాదించుకుంటూ వైద్య వత్తి ఖ్యాతిని మరింత ఇనుమడింపజేస్తున్నారు. ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్ వైద్యులు, వైద్య విద్యార్థులు లక్షలాది మంది పేదల ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డుపెట్టి కరోనా నుంచి రక్షించారు.

స్ట్రోక్ నుంచి ప్రాణాలు రక్షిస్తున్నారు....



బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) వస్తే ప్రాణాలు గాల్లో కలిసి పోవాల్సిందే. కొన్నిసార్లు ప్రాణాలు నిలిచినా శాశ్వతంగా అంగవైకల్యంతో బాధపడాల్సి వస్తుంది. ఇలాంటి స్ట్రోక్ నుంచి పేదలను రక్షించేందుకు గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందర చారి దాతల సహాయంతో 2015లో జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో కోటి రూపాయలతో స్ట్రోక్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. లక్షల రూపాయలు విలువైన న్యూరో వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందేలా చేస్తూ లక్షలాది మంది ప్రజల ప్రాణాలు కాపాడుతూ వారి గుండెల్లో దేవుడిలా నిలిచిపోయారు. ప్రిన్సిపాల్‌గా 2024 నవంబర్‌లో బాధ్యతలు స్వీకరించి గుంటూరు మెడికల్ కాలేజీకి తన దృఢ సంకల్పంతో సరికొత్త రూపు తీసుకొచ్చారు. ఆరు నెలల వ్యవధిలో దాతలు, పూర్వ వైద్య విద్యార్థుల సాయంతో సుమారు ఏడు కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేసి కార్పొరేట్ వైద్య కళాశాల మాదిరిగా మార్చివేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు వైద్య కళాశాలను రోల్‌మోడల్‌గా చర్చించుకునేలా చేశారు.

నడకను ఇస్తూ చేయూత ఇస్తున్నారు..



రోడ్డు ప్రమాదాల్లో కాలు, చేయి తీవ్ర గాయాలపాలై చికిత్స కోసం వస్తున్న ఎంతో మంది నిరుపేదలకు ప్రభుత్వ ఆర్థోపెడిక్ సర్జన్‌గా గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ ఆపరేషన్లు చేసి కాలు, చేయి పనిచేశాలా చేస్తున్నారు. కొన్ని సార్లు విధి వక్రీకరించి ఆపరేషన్ చేసినా ఫలితం లేక కాలు, చేయి కోల్పోయి జీవితం దుర్భరంగా మారిన ఎంతో మంది బాధితులను తన అనుభవంలో చూసి చలించిపోయారు. వారికి తన వంతు ఏదైనా చేయాలనే సంకల్పంతో వాక్ ఫౌండేషన్‌ను దాతల సాయంతో ఏర్పాటు చేశారు. రాజస్థాన్ నుంచి కృత్రిమ కాళ్లు, చేతులు చేయించి ఇక్కడికి తెప్పించి ఉచితంగా అందజేసి వారి నడకకు సాయం చేస్తూ చేయూత నిస్తున్నారు. కృత్రిమ కాలు, చేయి అమర్చటం ద్వారా కొంత మేరకు బాధితులు వారి పనులు వారే చేసుకోవటం, కొంత మంది స్వయం ఉపాధి కూడా చేసుకుంటూ కాలు, చేతులు ఇచ్చిన ప్రత్యక్ష దైవానికి చేతులు జోడించి నమస్కరిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల్లోని ఫిర్యాదులకు సంబంధించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ జనన మరణ నమోదు విభాగం వద్ద, పీజీఆర్ఎస్‌ను అదనపు కమిషనర్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 16 ఫిర్యాదులు అందుకొని మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం పీజీఆర్ఎస్ ద్వారా 24 ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 16, ఇంజినీరింగ్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 3 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.



డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

ఎమినిటీ సెక్రటరీలకు వీధి దీపాల బాధ్యత

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి జీతాలు పెంచాలని గత సోమవారం నుంచి చేస్తున్న సమ్మెలో భాగంగా రెండు రోజుల నుంచి వీధి దీపాలను అవుట్ సోర్సింగ్ కార్మికులు వెలగించకపోవడంతో కౌన్సిల్‌లో దుమారం రేగింది. దీంతో సోమవారం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు, విద్యుత్ శాఖ కింద పనిచేసే ఎనర్జీ అసిస్టెంట్స్‌తో ఎమినిటీ సెక్రటరీలు సమన్వయం చేసుకుని వీధి దీపాలను వెలగించాలన్నారు. సమ్మెలో పాల్గొన్న వారికి 24 గంటల్లో విధులకు హాజరు కావాలని నోటీసులు ఇవ్వాలని అప్పటికి స్పందించకపోతే వారిని విధుల్లో నుంచి తొలగించాలని కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశిచారు.

కౌన్సిల్ హాల్ మీటింగ్‌పై కార్పొరేటర్ల అభ్యంతరం

ఉదయం పూట ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం మధ్యాహ్నం 1.47గంటలకు భోజనం విరామం ఇచ్చారు. తిరిగి 2.30 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. వచ్చేలోగా కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం కావడంతో కార్పొరేటర్లు బయట కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. కౌన్సిల్ జరిగే సమయంలో ఈ విధంగా సమావేశం ఏర్పాటు చేయడంపై కార్పొరేటర్లు మండిపడ్డారు.

ఆయురారోగ్యాలతో జీవించాలి



నగరంపాలెం: శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడపాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఏఎస్ఐ అంబటి శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు అతన్ని ఐజీ పూలమాలలతో సన్మానించగా, సీఐ ఫిరోజ్ పాల్గొన్నారు.

జేఎల్ఎం గ్రేడ్- 2 సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మీపురం: జేఎల్ఎం గ్రేడ్- 2 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(యూఈఈయూ) రాష్ట్ర నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ఆయన సానుకూలంగా స్పందిస్తూ విద్యుత్ సంస్థలో విలీనం చేయడం విషయంలో ప్రభుత్వం ఆలోచిస్తుందని త్వరలోనే ఏ విషయం తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుదర్శన్ రెడ్డి, జేఎల్ఎం గ్రేడ్- 2 కన్వీనర్ పెంచల ప్రసాద్, యూనియన్ రాష్ట్ర నాయకత్వం నాయబ్ రసూల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మీపురం: ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనగర్ ప్రాంతానికి చెందిన చింతా భాగ్యలక్ష్మి, నాగేశ్వరరావు 2000లో వివాహం చేసుకున్నారు. నాగేశ్వరరావు(45) ఆర్అండ్‌బీ కార్యాలయంలో అటెండర్‌గా కొంత కాలం పని చేశారు. చెడు వ్యసనాలకు బానిస అయి ఉద్యోగం వదిలేశాడు. ఓ కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై ఈనెల 3వ తేదీన ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి భార్యతో వాగ్వాదం జరిగింది. దీంతో భాగ్యలక్ష్మి సోదరుడు మెండు దుర్గాప్రసాద్ వచ్చి ఇద్దరికి నచ్చ చెప్పి వెళ్లాడు. అయినా భర్త మద్యం మత్తుతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుండటంతో ఇంట్లో నుంచి సోదరుడు ఇంటికి వెళ్ళింది. మరుసటి రోజు సోమవారం ఉదయం ఇంటికి వచ్చి తలుపులు ఎంత కొట్టిన తీయక పోవడంతో స్థానికుల సహాయంతో గమనించగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని నాగేశ్వరరావు ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఈ విషయం తెలుసున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రి పోస్ట్‌మార్టంకు తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సాధికారత దిశగా పయనించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు స్వశక్తితో సాధికారత దిశగా పయనించాలని బిడ్ అలర్ట్ పోర్టల్ వ్యవస్థాపక సీఈఓ షేక్ జానీమూన్ పేర్కొన్నారు. సోమవారం జేకేసీ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ అజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడారు. వర్క్‌షాప్‌లో కళాశాల ఎంటర్‌ప్రెన్యూర్ విభాగ ఉపాధ్యక్షుడు ఎం.అప్పారావు, సభ్యులు డాక్టర్ వై.సురేష్‌బాబు, చరణ్ చౌదరి, అంజనాదేవి, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ విభాగ ఉపాధ్యక్షురాలు పి.నాగసుశీల, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు పాల్గొన్నారు.

గుళ్లపల్లి సేవలు ప్రశంసనీయం

నగరంపాలెం: రెండున్నర దశాబ్దాలకుపైగా ఆధ్యాత్మిక, విద్య సంస్థలకు, దేవాలయాలకు, కళా సాంస్కృతిక రంగాలకు భూరి విరాళాలు అందిస్తూ, సామాజిక సేవలు అందిస్తున్న గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ సేవలు అభినందనీయమని బృందావన్‌గార్డెన్స్ దేవస్థానం కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై సోమవారం గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ వ్యవస్థాపకులు గుళ్లపల్లి సుబ్బారావు 75వ జన్మదిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ఎంఎస్ఎస్ సాయి పేర్కొన్నారు. సోమవారం గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో యువజన సర్వీసుల శాఖ (స్టెప్-స్వశక్తి) ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఈవ్ టీజింగ్, మహిళా సాధికారతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా, సంక్షేమ శాఖ సఖి న్యాయవాది ఏ విజయలక్ష్మి, యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సంధ్య పాల్గొన్నారు.

శోధనే వైద్యానికి మూలం

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్యునిగా ఎదిగేందుకు జీవితాంతం అధ్యయనాన్ని కొనసాగించాలని గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారి పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం డాక్టర్స్ డే నిర్వహించారు. హిందూ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ వైద్యులు నిరంతరం అభ్యాసం, అధ్యాపన, పరిశోధనలో నిమగ్నమవుతారని వివరించారు. కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, సహాయాచార్యులు షబానా పర్వీన్, వైష్ణవి, వేదవతి, ఎ.బాజీబాబు, అభిలాష్, అనిత, రాజేశ్వరి, వెంకట కళ్యాణ్, ఉమాదేవి, ఎంసీఏ విభాగాధిపతి డి.రాజ్యలక్ష్మి, శశికళ, ప్రియాంక పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం



గుంటూరు ఎడ్యుకేషన్: పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా విధులు నిర్వర్తించిన నంబూరు మల్లేశ్వరి ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభ సోమవారం నిర్వహించారు. 2009లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మజ, జయశ్రీ, ఉపాధ్యాయులు వసుంధరాదేవి, శాంతకుమారి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

లక్ష్మీపురం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు కోరారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వరప్రసాద్ సునీల్, నాగేశ్వరెడ్డి, వెంకటేశ్వర్లు, ఆదినారాయణమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం ఆర్ వై ఎస్ ఎస్ సీఈఓ రామారావుకు వినతిపత్రం అందజేశారు.

అబ్దుల్ రఫీక్ సన్మానం



లక్ష్మీపురం: జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులుగా పదవీ విరమణ చేసిన అబ్దుల్ రఫీక్‌ని సోమవారం సాయంత్రం బ్రాడీపేటలోని కార్యాలయంలో కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రఫీక్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎంతో సహకారంతో పనిచేసినట్లు చెప్పారు. అనంతరం శాఖ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్ఓ జె.శ్యామ్ కుమార్, ఏఈఐఈలు కిషోర్, మస్తాన్, పీఆర్వో వై.వెంకటేశ్వర్లు, ఏవీఎస్ కష్టయ్య, సీనియర్ సహాయకులు డి.సురేష్, టైపిస్టులు సిహెచ్ శివరామకృష్ణ , ఎస్.బుజ్జి పాల్గొన్నారు.

స్టాల్ గరల్స్ హైస్కూల్‌లోనే వసతిగృహాన్ని కల్పించాలి

లక్ష్మీపురం: జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఇద్దరు విద్యార్థినులు సోమవారం నిరసన తెలిపారు. స్టాల్ గరల్స్ వసతి గృహాన్ని కల్పించాలని కోరుతూ ఫ్లెక్సీ పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

జూలై 9 సమ్మెను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: లేబర్ కోడ్‌ల రద్దు చేయాలని, కార్మిక చట్టాల రక్షణ కోసం కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9 వ తేదీ నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో విద్యుత్ రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జల్లెడ రాజశేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏపీ సీపీడీసీఎల్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జి.నాగరాజు అధ్యక్షత వహించారు. సమస్యలు పరిష్కారం కోసం ఆగస్టు 8న చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి లక్ష్మణరావు మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక

ఏపీ సీపీడీసీఎల్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పులి అనిల్ కుమార్, జి.నాగరాజు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా విజయరావు, పవన్, మురికిపూడి రవికుమార్, తోకల వర్మ, బొర్రా సురేష్, సాంబయ్య, సిహెచ్.నాగ వంశీ, రాజశేఖర్, పూర్ణచంద్రరావు, కే రాంబాబు, తిరుపతిరావు ఎన్నికయ్యారు.



వైద్యులకు క్రీడలు తప్పనిసరి

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: వృత్తిపరంగా నిత్యం ఒత్తిడితో బిజీగా ఉండే వైద్యులకు ఆటవిడుపు కోసం క్రీడలు తప్పనిసరి అని గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. సోమవారం ఐఎంఏ హాలులో డాక్టర్లకు బహుమతి ప్రదానం చేశారు. డాక్టర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్ఓ విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తిపరంగా ఒత్తిడిలో ఉండే వైద్యులు తప్పకుండా తీరిక సమయాన్ని నాణ్యమైన రీతిలో గడపాలన్నారు. అందులో భాగంగా క్రీడా కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో వైద్యులు క్యారమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ జలీల్, చెస్ ఆర్బిటర్ షేక్ నబీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జాన్ షహీద్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎంహెచ్ఓ

ప్రొఫెసర్ సంధ్యావళి సేవలు ప్రశంసనీయం

డాక్టర్ ఎస్.వి.సుందరాచారి



మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్‌లో నేత్ర వైద్య విభాగం ఆచార్యులుగా ప్రొఫెసర్ లామ్ జమీ సంధ్యావళి చేసిన సేవలు, విధి నిర్వహణ విధానాలు ప్రశంసనీయమని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి కొనియాడారు. సోమవారం జింకానా ఆడిటోరియంలో ప్రొఫెసర్ సంధ్యా వళి పదవి విరమణ సభలో డాక్టర్ సుందరాచారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి జీజీహెచ్ కంటి వైద్యవిభాగాధిపతి డాక్టర్ రవిబాబు అధ్యక్షత వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షుడు డాక్టర్ వి.వి నారాయణరావు, ప్రొఫెసర్ రవిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.ప్రశాంత్, స్వరూప్ కుమార్, ఏవీ రావు, శ్రీదేవి, పద్మావతి, శిరీష, హారిక, ఉష పాల్గొన్నారు.

ఔషధ దుష్ప్రభావాలపై పర్యవేక్షణ అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రకళ

గుంటూరు ఎడ్యుకేషన్: ఔషధ దుష్ప్రభావాలపై పర్యవేక్షణ అవసరమని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.చంద్రకళ పేర్కొన్నారు. సోమవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఔషధ ప్రతికూల ప్రభావాల పర్యవేక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ చంద్రకళ మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్యశాఖ ఘజియాబాద్‌లో నిర్వహిస్తున్న జాతీయ ఔషధ దుష్ప్రభావాల పర్యవేక్షణా సంస్థ అనుసరిస్తున్న విధి, విధానాలను వివరించారు. ఫార్మకాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృష్ణకాంత్ మాట్లాడుతూ వివిధ రకాల ఔషధ దుష్ప్రభావాలను గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వర్క్‌షాప్‌లో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఫార్మకాలజీ, ఫార్మసీ ప్రాక్టీసు విభాగాధిపతులు డాక్టర్ బ్రహ్మ శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్.హేమకుమారి, ఫార్మసీ ప్రాక్టీసు డైరెక్టర్ పి. సీతారామయ్య, ఫార్మాడి విద్యార్థులు పాల్గొన్నారు.